# భగవద్గీత

తెలుగు సేత : డా॥ పి.కృష్ణయ్య

ఎమెస్కో

# గ్రంథ పరిచయం

### 1. భగవద్గీత.. పుట్టు పూర్వోత్తరాలు

మహాభారతం లోని భీష్మ పర్వము నందు 25 వ అధ్యాయం నుండి 42 వ అధ్యాయం వరకు వున్న గ్రంథభాగం శ్రీమద్భగవద్గీతగా మన్నన పొందింది. మహాభారతం పంచమవేదంగా ప్రసిద్ధి కాంచగా దాని సారమే భగవద్గీతగా పండితులు తెలిపారు. ఈ భగవద్గీతను వుపనిషత్తని, బ్రహ్మవిద్య యని, యోగ శాస్త్రమని కూడా కోవిదులు కొనియాడారు. రమారమి ఐదువేల సంవత్సరముల నాడు ద్వాపర యుగాంతమున కురుక్షేత్ర యుద్ధభూమిలో అంకురించి, ఆకు తొడిగి, మొగ్గ వేసి, పుష్పించి, ఫలించినదీ కర్మఫల వృక్షం. మానవ జాతికి ఒక వినూత్నమైన విభిన్నమైన కార్మిక జీవన విధానాన్ని భగవంతుడే నేరుగా అర్జునుని ద్వారా అందించాడు. సకల కాలాలకు, సకల కులాలకు, సకల వృత్తులకు, సకల ప్రవృత్తులకు సరిపడు నూతన సమన్వయ జీవన విధానాన్ని భగవద్గీతలో శ్రీకృష్ణుడు ప్రబోధించాడు. ఆ నాటినుండి ఎందరో మహనీయులు, విజ్ఞులు గీతా ప్రశస్తిని, గీతా ఫలితాన్ని, గీతానుష్ఠానాన్ని పలు విధములుగా వర్ణించి యున్నారు. ప్రపంచంలో ఎనభైకి పైగా వివిధ భాషల లోనికి అనువదింపబడటం గీత సార్వజనీనతను, ప్రాశస్త్యాన్ని ప్రస్ఫుటం జేస్తున్నది. తెలుగులో కూడా పలు అనువాదాలు, వ్యాఖ్యానాలు అందుబాటులో వున్నాయి.

### 2. గీతా ప్రశస్తి

గీత యనగా గానము చేయబడినది యని, ఆనందదాయని యని, ముక్తి మార్గమని, జ్ఞాన బోధిని యని, సమ దర్శిని, ప్రకృతి ప్రేమి యని, భూత దయామయి అని చివరగా మానవ జీవితం ఆటు పోట్లకు గురి కాకుండా సజావుగా సాగేందుకు భగవంతుడు నిర్దేశించిన పరిష్కారాల పట్టిక యని పండితులు పలు రకాలుగా అన్వయిస్తారు. భగవంతుడు పాడిన గీత కావున భగవద్గీత అంటారు పెద్దలు. అచ్చ తెలుగులో చెప్పుకుంటే దేవుని పాట. పాటలు మనసుకు ఎంతో

ఆహ్లాదాన్ని సమకూరుస్తాయి. సంగీతం, పాటలు పద్యాలు కష్టజీవికి శ్రమనుండి ఉపశమనం కలిగిస్తాయి. సంగీతానికి ఫణులు పడగ విప్పి ఆడుతాయి. గోవులు పాలు స్రవిస్తాయి. సంగీతం రోగులకు మానసిక ప్రశాంతతను అందిస్తుంది. మానవ జనితమైన మధుర గానమే యింత రసానుభూతిని కలిగిస్తే భగవంతుడే అందించిన యీ గీతం మానవ లోకాన్ని ఆనంద డోలికల్లో విహరింపజేయడంలో ఆశ్చర్య పడవలసిన దేముంది? బాలునిగా తన మురళీ గానంతో గోవుల సమూహాన్ని, గోపికా లోకాన్ని పరవశింప జేసిన ఆ శ్రీకృష్ణ పరమాత్మ తన గీతా గానంతో మానవ లోకానికి జీవన జ్ఞాన విజ్ఞాన భక్తి ముక్తి సంగీతాన్ని ప్రసాదించాడు.

### 3. అందరికీ భగవద్గీత ఎందుకు పరిచయం కాలేదు?

భగవద్గీత యనగానే అది ఒక వైరాగ్య జీవితానికి ప్రతీక గానో, ముసలితనంలో చదువుకునే ఆధ్యాత్మిక గ్రంథంగానో పరిగణించటం ఓ పరిపాటి అయ్యింది. గుడిలో వినిపించే ఘంటసాల గారి భగవద్గీత శ్లోకాలలోని అమర గంభీర స్వరం భగవద్గీతకు పండిత పామర లోకంలో ప్రాచుర్యం కల్పించిందనడంలో అతిశయోక్తి లేదు. కానీ యివే శ్లోకాలు శోకానికి సంకేతంగాను, వైరాగ్యానికి ప్రతిరూపంగా పరిణమించడం ఒక అసంకల్పిత దుస్సందేశం. ఈ గీతాగానం మనిషి మరణానంతరం, పార్థివ దేహం వెంట వినిపించే విషాద సంగీతంగా మారడం ఒక విధి వైచిత్రి. మన విద్యాప్రణాళికల్లో ప్రాథమిక స్థాయి నుండి ఈ గ్రంథాన్ని పరిచయం చేయక పోవడం వల్లనో, అందలి కథా వస్తువును వున్నత స్థాయి పాఠ్యాంశాలలో బోధించనందువల్లనో, తెలుగు విద్యార్థులకు భగవద్గీత ఒక 'అపరిచయ' వస్తువు అయింది. నాలుగో ఐదో వేమన పద్యాలు, రెండో మూడో సుమతిశతకం లోనివి ప్రతి తెలుగువానికి కంఠస్థం. గర్వ కారణంకూడా. కానీ తెలుగులో ప్రామాణికమైన తత్సమాన భాషాన్తరీకరణ గ్రంథం లేక పోవుట వలనో ఏమో మొత్తం మీద భగవద్గీత రామాయణం, మహాభారతం, భాగవతం లాగా తెలుగు ప్రజలకు అంతగా తెలియక పోవడం దురదృష్టం. పురాణేతిహాసములతో బాటు, వ్యక్తిత్వ వికాసానికి వుపయోగపడే భగవద్గీతలోని కొన్ని అంశాలను పాఠ్య ప్రణాళికల్లోప్రవేశ పెట్టడం సముచితమని నా అభిమతం.